# అతిసారం, మలేరియా, విషజ్వరాలు ఆదివాసీలకే ఎందుకొస్తాయి?

ఆదివాసులకు మాత్రమే రావు. ఇతరులకు కూడ వస్తుంటాయి.

అయితే డబ్బుగల వాళ్ల కంటే లేని వాళ్ల కెక్కువగా, కులంగలవాళ్లకంటె లేని వాళ్ల కెక్కువగా, పట్టణవాసులకంటే పల్లెవాసుల కెక్కువగా, అందరి కంటె ఆదివాసీలకెక్కువగా వస్తుంటాయి.

కిందటి సంవత్సరం ఆదిలాబాద్‌లో చూసాము. ఈ సంవత్సరం విశాఖపట్నంలో చూస్తున్నాము. ఒకవైపు అతిసార వ్యాధి, దాని పక్కనే మలేరియా/వైరల్ ఫీవర్ (తెలుగు దినపత్రికల భాషలో విషజ్వరం) వందల - బహుశా వేల - ప్రాణాలు తీసాయి. గత సంవత్సరం ఆదిలాబాద్‌లో చనిపోయింది ఎక్కువగా ఆదివాసీలు కాగా ఈ సంవత్సరం విశాఖపట్నంలో చనిపోతున్నది అందరూ ఆదివాసీలే. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలోని 52 మండలాలలో 46 ఈ అకాల మరణాల బారినపడగా ఈ సంవత్సరం విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజన్సీలోని 11 మండలాలలో ప్రతీ మండలం నుండి 'విషజ్వరం' చావుల వార్తలు వస్తున్నాయి.

కార్గిల్‌లో భారత సైనికులు ఎంతమంది చనిపోయారన్నది వివాదాస్పదంగానే ఉండవచ్చును గానీ విశాఖపట్నంలో ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం కూడ అంతకంటె ఎక్కువ మంది ఆదివాసీలు 'విషజ్వరాలకు' చనిపోయారు. అయితే వీళ్ల కోసం ఎవరూ నిధులు వసూలు చేయలేదు, ఏ సినీతారలూ సంఘీభావంగా ఊరేగింపులు తీయలేదు, ఏ ప్రభుత్వ ఉద్యోగులూ ఒక రోజు జీతం ఇవ్వలేదు, ఏ చంద్రబాబూ సానుభూతి ప్రదర్శన నిర్వహించలేదు. సైన్యం కంటె ఏజెన్సీ ఆదివాసీలకే ఇవి ఎక్కువ అవసరం (చంద్రబాబు సానుభూతి మినహాయించి) అని వేరే చెప్పనవసరం లేదు. కానీ మన 'దేశభక్తి' స్వరూపం అట్లాంటిది.

ఆదివాసీల ఆరోగ్య పరిస్థితుల గురించి మన రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ముఖ్య అధికారిగా ఉన్న సుజాతారావుగారు కొన్నాళ్ల క్రితం ఒక వ్యాసంలో వివరించారు. రాష్ట్రంలో మలేరియా జ్వరంతో చనిపోయేవారిలో 75 శాతం ఆదివాసీలేనని అంటూ, సాధారణ పరిస్థితులలో సహితం ప్రతీ 1000 మంది ఆదివాసీలలో 18 మంది మలేరియా బాధితులుంటారని ఆమె అన్నారు. క్షయరోగుల నిష్పత్తి ఆదివాసీలలో రాష్ట్ర సగటు కంటె రెండు రెట్లు ఉందనీ, ప్రసవం సమయంలో చనిపోయే స్త్రీల నిష్పత్తి కూడ ఆదివాసీలలో రాష్ట్ర సగటు కంటె రెండు రెట్లు ఉందనీ (కొన్ని తెగలలో ఆరు రెట్లు ఉందనీ), పసితనంలో చనిపోయే పిల్లల నిష్పత్తి సహితం అంతేనని ఆమె అన్నారు. సవర, జాతాపు, గదబ వంటి ఆదివాసీ తెగలలో సంభవించే మరణాలలో 50 శాతం 5 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలవేనని అన్నారు.

ఇది 'సాధారణ' పరిస్థితుల సంగతి. అంటే గత సంవత్సరం ఆదిలాబాద్‌లోనూ ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ వచ్చిన జ్వరాల ఉప్పెన లాంటిది లేనప్పటి పరిస్థితి. పోషకాహార లోపం (దానికి అవసరమైన వనరులుగానీ ఆదాయం గానీ లేకపోవడం), రక్షిత మంచినీటి ఏర్పాటు లేకపోవడం, పరిసరాల పారిశుధ్యంలో లోపం, అందుబాట్లో (అంటే దగ్గరిలో అనే కాదు, చవగ్గా అని కూడ) వైద్య సదుపాయాలు లేకపోవడం, వైద్యసదుపాయాలు ఉన్నట్టు కాగితాల మీద చెప్పుకున్న చోట కూడ డాక్టర్లు, ఇతర సిబ్బంది తరచుగా గైర్‌హాజరు కావడం, మందుల ధరలు అందుబాట్లో లేకుండ పెరిగిపోవడం ఈ పరిస్థితికి కారణంగా చెప్పుకోవచ్చు.

మామూలు సమయాలలో ఈ పరిస్థితికి ప్రభుత్వం ఏ వివరణా ఇవ్వదు. ఇమ్మని ఎవ్వరూ అడగరు. కానీ అప్పుడప్పుడు రోగాల ఉప్పెన వస్తుంది. అప్పుడు పత్రికలు రాస్తాయి. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు బాధిత ప్రాంతాలు పర్యటించి విషయాలు వెలికితీసి ఆందోళన చేస్తాయి.

అప్పుడు మొదట జరిగేది 'ఎంత మంది చనిపోయారు' అనే సంవాదం. నిరుడు ఆదిలాబాద్‌లో 1000 మందికి పైగా చనిపోయారని పత్రికలు రాసాయి. 2135 అని కాంగ్రెస్ వారు అన్నారు. కానీ 399 మంది 'మాత్రమే' చనిపోయారని రాష్ట్ర ప్రభుత్వం అంటుంది.

ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ అంతే. జూలై 1 నాటికి పాడేరు ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొత్తం 418 చావులు నమోదయ్యాయి. వాటిలో 158 జ్వరాల కారణంగా (అంటే మలేరియా కావచ్చు, వైరల్ ఫీవర్ కావచ్చు) జరిగిన మరణాలని ప్రభుత్వ అధికారులు అంటున్నారు. వివిధ ప్రజాసంఘాలు మాత్రం 1000కి పైగా చనిపోయారని అంటున్నారు.

చాలా బాధాకరమైన ఈ చావుల లెక్కల వివాదంతోనే సమస్య తెల్లవారిపోతుంది. ఈ చావులను ఆపడానికి ప్రభుత్వం ఏమీ ఎందుకు చేయదు? పోషకాహార లోపాన్నీ ఆదాయ లోపాన్నీ సవరించడానికి కొంత సమయం పడుతుందని ప్రభుత్వం అనొచ్చు. నలభై ఏళ్లగా ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని అడగొచ్చు గానీ మాట వరసకు కొంత సమయం కావాలని ఒప్పుకుందాం. కానీ పారిశుధ్యం గురించి, వైద్య వ్యవస్థ గురించి, రక్షిత మంచినీటి పథకాల అమలు గురించి ప్రభుత్వం ఎందుకని ఏమీ చేయదు?

ఆదిలాబాద్‌లో గత సంవత్సరం సంభవించిన మరణాలకు శుభ్రమైన తాగునీటి లేమి ప్రధాన కారణం అనేది అందరికీ తెలిసిన విషయమే. ఆ జిల్లాలోని 5 వేల చిల్లర జనావాసాలలో (ఒక్కొక్క గూడేన్నీ ఒక్కొక్క జనావాసంగా లెక్కగడితే) కేవలం 20 శాతానికి రక్షిత మంచినీటి పథకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన నోటీసుకు జవాబుగా చెప్పింది. రాష్ట్ర అవతరణ జరిగిన నాలుగు దశాబ్దాల తరువాత (స్వర్ణాంధ్ర ప్రదేశ్‌కు కేవలం రెండు దశాబ్దాల ఇవతల) ఆదివాసీ గూడేల నిలయమయిన ఆదిలాబాద్ దుర్గతి ఇది. పోనీ అయిందేదో అయింది, ఇక పైన ఏం చేయబోతున్నారని అడిగితే, ఈ సంవత్సరం తీరికగా ఇంకొన్ని జనావాసాలలో రక్షిత మంచినీటి పథకాలు చేపట్టబోతున్నామనీ వాటి వల్ల మంచినీళ్లు దొరికే జనావాసాల సంఖ్య 1999 చివరికి 20 శాతం నుండి 35 శాతానికి పెరుగుతుందనీ ప్రభుత్వం అంటుంది. కానీ ఈ వేసవి నాటికి కట్టిన మంచినీటి టాంకులు చెప్పినదానిలో 10 శాతం మాత్రమే. ఈ లెక్కన ఆదిలాబాద్‌లో అందరికీ శుభ్రమైన మంచి నీళ్లు దొరికేదెప్పుడు? అందరికీ ఉద్యోగాలు కాదు, అందరికీ భూములు కాదు, అందరికీ కడుపునిండా తిండికాదు, అందరికీ శుభ్రమైన మంచినీళ్లెప్పుడు దొరుకుతాయని అడుగుతున్నాం. సిగ్గువిడిచిపెట్టి (ఈ రాష్ట్రానికి చెందిన వాళ్లమయినందుకు) ఆ ప్రశ్న అడుగుతున్నాం. అది జరగనంత కాలం ఆదిలాబాద్ జిల్లాకు అతిసార వ్యాధి నుండి రక్షణ ఉండదు. ఈ సంగతి తెలిసి కూడ ప్రభుత్వం చొరవగా కదలక పోవడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

రక్షిత మంచినీటి వ్యవస్థ లాగే ప్రభుత్వం తలచుకుంటే వెంటనే చేయగలిగింది పారిశుద్ధ్యాన్ని కాపాడడం, వైద్యవ్యవస్థను బాగుపరచడం. విశాఖపట్నంలో ప్రస్తుతమున్న పరిస్థితిని నివారించడానికి ఈ చర్యలు ఉపయోగపడి ఉండేవి. ఏజెన్సీ గూడేలలో తాండవిస్తున్న మృత్యువును నిలువరించడానికి ఉపయోగపడి ఉండేవి. పైన చెప్పిన వ్యాసంలో సుజాతారావుగారు దీనికి సంబంధించి వివరమయిన సూచనలిచ్చారు. ఆమె వేరే ఎవరో కాదు. మన రాష్ట్ర ప్రభుత్వంలోనే ప్రిన్సిపల్ సెక్రటరీ హోదా ఉన్న ఐఏఎస్ అధికారి. కొంత కాలం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడ ఉన్నారు. ఆమె వంటి వారి నైపుణ్యాన్ని వాడుకొని ఏజెన్సీలో వైద్య, ఆరోగ్య, పారిశుధ్య వ్యవస్థలను బాగుచేయడానికి ప్రభుత్వానికి ఏం కష్టమొచ్చింది?

ఏం కష్టమొచ్చిందోగానీ చేయగల పనులు ప్రభుత్వం చేయకపోవడం వల్ల నిరుడు ఆదిలాబాద్‌లోనూ ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ కొన్ని వందల - బహుశా వేల - ప్రాణాలు పోయాయి. పోయిన ప్రాణాలను లెక్కబెట్టవచ్చునేమోగానీ తమ ఆప్తులను పోగొట్టుకున్నవారి బాధనూ తమ కన్నపిల్లలు కళ్ల ఎదుటే జ్వరానికి బలి అవుతుంటే నిస్సహాయంగా చూడడం తప్ప ఏమీ చేయలేని ఆదివాసీ తలిదండ్రుల ఆవేదననూ ఎవరు లెక్కగట్ట గలరు?

20వ దశాబ్దపు చివరి దశకంలో ఎవ్వరూ చావనవసరం లేని పద్ధతిలో ఈ ప్రజలు చనిపోతున్నారు. శుభ్రమైన మంచి నీళ్లు లేక, శుభ్రమైన పరిసరాలు లేక పారిశుధ్యానికి అవసరమైన డిడిటి వంటి క్రిమి సంహారక మందులు లేక, ఉన్నవాటిని ఉపయోగించే శ్రద్ధగల అధికారులు లేక గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో 50 లక్షల రూపాయలు విలువగల డిడిటి కాలపరిమితి లోపల వినియోగించక వృధా అయిందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక విమర్శించింది. అదే సమయంలో అతిసార, మలేరియా వంటి రోగులకు ఆ జిల్లాలో వంద మంది బలయ్యారు. షాపులనిండా ఉన్న మందులు, పుస్తకాల నిండా ఉన్న వైద్యనైపుణ్యం రోగులకు అందుబాట్లో లేక చనిపోయారు.

ఏ నిర్లక్ష్యం వల్ల కార్గిల్ సరిహద్దు దగ్గర నాలుగయిదు వందల మంది సైనికులు చనిపోయారని దేశమంతా చర్చిస్తున్న భారతావనిలో, ఈ నిర్లక్ష్యాన్ని గురించి, దీనికి బలయిన జనాన్ని గురించి ప్రశ్నలు వేసేవారు లేరు, జవాబు కోసం నిలదీసేవారు లేరు.

వాళ్లు ఆదివాసీలనే కదా?

**బహిరంగ సభ**

**ఆగస్ట్ 2వ తేది సోమవారం సాయంత్రం 6 గంటలకు**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం** (మినీహాలు, బాగ్‌లింగంపల్లి)

**లకే రాజారావు** (బహుజన్‌సమాజ్ పార్టీ, పాడేరు)

**ప్రకాశ్** (తెలంగాణ మహాసభ)

**డా॥ వీణ శత్రుఘ్న**

తదితరులు మాట్లాడతారు

30-7-99

**మానవహక్కుల వేదిక**

**Human Rights Forum**